# యాత్రానందం

యాభై యేళ్ళ క్రిందటి సంగతి. ఉన్నట్టుండి ఒక గ్రామస్తుడు శుభ్రంగా బోడి చేయించుకున్న తలతో ప్రత్యక్షమైపోతే "ఏందిరా చిన్నబ్బా! ఏం సంగతీ?" అన్న పరామర్శ వెలువడడమూ, "మొన్ననే కొండకు పోయొస్తిసామీ!" అని బదులు రావడమూ పరిపాటి, "స్వామి ఎట్లా ఉండాడురా చిన్నబ్బా?" అనేది రెండో ప్రశ్న. దీనికిక జవాబు విని తీరవలసిందే! "ఆ సంగతేమందు సామీ! పట్టు పీతాంబరాలు, నిలువెత్తు తోమాలలు, కళ్ళు జిగేల్ జిగేల్ మనేటట్టుగా రాళ్లు పొదిగిన నగలు - ఆ వైభోగం చెప్పతరమా! ఎందరెందరు జనం, ఎన్ని రకాల మాటలు, ఎన్నెన్ని వేషాలు - పోయిన వాళ్ళు పోతా వుంటే వచ్చే వాళ్ళు వస్తానే వుంటారనుకోండి! మహన్నభావుడికి కొదవేముంది? నిత్యకళ్యాణం, పచ్చతోరణం!"

ఆ వైభవాన్ని మనం కళ్ళారా చూచేదెప్పుడు - అనుకునే వాణ్ణి.

అప్పుడు నాకు తొమ్మిదేళ్ళు. రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైందిగానీ, దాని ప్రభావం మన ప్రాంతం పైకి అట్టే ప్రసరించలేదు. దేశం నిమ్మకు నీరెత్తినట్టు సుభిక్షంగా ఉండేది. ఓ రోజు రాత్రి, పుచ్చపువ్వులా వెన్నెల కాస్తున్న వేళ, రెండు పెంకుటిళ్ళకూ మధ్య ఆరుబయల్లో మంచం వాల్చుకున్నారు నాన్నగారు, ఆయన ప్రక్కనే నా తావు, ఎప్పుడైనా తన ప్లాన్లూ, పథకాలూ నాతో చెప్పడం మా నాన్నగారికో సరదా! ఉండి, ఉండీ ఆయనన్నారు గదా - "ఒరే రామూ! అమావాస్య పోయినాక పంచమి రోజున మనం ఇలు తీర్థం వెళ్తున్నామురా!"

"ఇలు తీర్థమంటే ఏంది నాన్నా?" అని అడిగాను.

నాన్నగారు వివరించారు - "ఇలు తీర్థమంటే ఇంట్లో ఎవరూ వుండకుండా తలుపుమూసి, తాళం బిగించి, అందరమూ కలిసి తిరుపతి కొండకు వెళ్ళి, స్వామిని దర్శించుకొని, మొక్కుబళ్ళు, చెల్లించుకొని తిరిగి రావడమన్నమాట!"

కుటుంబ సభ్యుల నందరినీ లెక్క పెట్టుకుంటూ నేను మళ్ళీ అడిగాను, "నాన్న, అమ్మ, చెల్లి, చిన్నాన్న, పిన్ని, బుజ్జిపాప, చిన్న చిన్నాన్న, నాన్నమ్మ, నేను - మొత్తం తొమ్మిది మంది. అందరమూ వెళ్తున్నామా నాన్నా?"

"అరగొండ నుంచి మీ అత్తమ్మగూడా వస్తుందిరా రామూ!"

అత్తమ్మ వస్తే దేవకి గూడా తప్పకుండా వస్తుంది. దేవకంటే మా అత్తమ్మ కూతురు, నాకంటే, మూడేళ్లో, నాలుగేళ్లో పెద్దది. అరగొండ హైయర్ ఎలిమెంటరీ స్కూల్లో నిరుటి సంవత్సరమే ఎనిమిదో తరగతి పాసయింది. మీకూ, నాకూ మధ్య రహస్యా లెందుకు లెండి! ఆ పిల్లను మా చిన్న, చిన్నాన్నకే చేసుకోబోతున్నాము. అయినా నేను 'పిన్నీ' అని పిలవనబ్బా! సిగ్గుగా వుంటుంది. 'అక్కా' అనే పిలుస్తాను. ఏమనుకున్నారో మీరు! మా

దేవకంటే కథలకు కాణాచి' పాటలకు పుట్టిల్లు. యాత్రలో దేవకి గూడా వుందంటే భలే సంబరం!

పంచమి రేపనగా ఈరోజు సాయంకాలానికి మా అత్తమ్మ దేవకితో బాటుగా ఒంటెద్దు బండిలో వచ్చేసింది.

అప్పటికి మా యింట్లో పెళ్ళిపడిన పాటుగా ఉంది. గోడలకు వెల్లవెయ్యడం, గచ్చుకడగడం, ముగ్గులు వెయ్యడం మామిడాకుల తోరణాలు గట్టడం పూర్తయింది. మురుకులు, పప్పుబిళ్ళలు, అతిరసాలు – అంతెందుకు, నిలవ వుండే ఫలహారాలన్నీ చేసి బుట్టలకు నింపేశారు. చవితినాటి రాత్రయితే మా ఇంట్లో పెద్దవాళ్ళకెవరికీ నిద్దర్లేవు. అర్ధరాత్రి నుంచి అభ్యంగన స్నానాలు మొదలెట్టారు. పులిహోరలు, పెరుగన్నాలు చేసి కళాయిపోసిన పాత్రల్లో పదిల పరిచారు. బట్టలూ, బ్లాంకెట్లూ, దుప్పట్లూ సర్దుకున్నారు. కొండపైన వంట చేసుకోడానికి బియ్యం, పప్పు, మిరపకాయలు, చింతపండు లాంటి కొంత అత్యవసర సామగ్రిని మేదర పెట్టెల్లో పెట్టించుకున్నారు. బరువులు మోయడానికి, ఆసరాగా వుండడానికి ఇద్దరు లేబ్రాయపు యువకులు గూడా మా వెంట రావడానికి సిద్ధమయ్యారు. పద్మూడుమంది వ్యక్తులతో రకరకాల సరంజామాతో తెల్లవారు జామున రెండు రెండెడ్ల బండ్లు కదిలాయి. విరగ బండి వాలిపోయిన వరిమళ్ళ మధ్య, జండా లెగరేస్తున్న చెరకు తోటల నడుమ, నీళ్ళు ఒడ్డును వొరుసుకుంటూ దలకలాడుతున్న చెరువు కట్టపైన, పక్షుల కలకూజితాలు వింటూ, మోటదోలే పంటకాపుల కబిల పదాలు ఆలకిస్తూ, చుక్కలు మసకబారి మాయమైపోతూండగా తూరుపు దిక్కున లేలేత కెంజాయలు పైకి లేవడం గమనిస్తూ ఎద్దుల బండిలో ప్రయాణం చేస్తుంటే ఎంత హాయిగా వుందో, చెప్పలేను. దామల్ చెరువు స్టేషను చేరుకునే సరికి భళ్ళున తెల్లవారింది. రాబోతున్న రైలు బండిని గురించి మా నాన్నగారి మూలంగా కొన్ని వివరాలు తెలిశాయి. దాన్ని పడమటికి వెళ్ళే బండి అంటారట. అంటే అదిప్పుడు పడమటి నుంచి తూర్పు దిశగా వస్తుందన్నమాట. రాత్రి ఎనిమిది గంటలకు ధర్మావరంలో బయల్దేరి ముదిగుబ్బ, మొలకవేముల, ముక్తాపురం, కదిరి, మొలకల చెరువు, మదనపల్లి, వాయల్పాడు మొదలైన స్టేషన్ల మీదుగా అది ఉదయం ఏడు గంటలకు పాకాల జంక్షను చేరుకుంటుందట! అక్కడ దక్షిణాది నుంచి వచ్చే రైల్లోకి మారవలసి వుంటుందట. పాకాల నుంచి తిరుపతికి రెండు స్టేషన్లే అడ్డం!

బండి పొగలు గ్రక్కుతూ వచ్చి స్టేషన్లో ఆగిన దృశ్యం నిన్న మొన్నటి దృశ్యంలా నాకింకా బాగా జ్ఞాపకం వుంది. సాగిపోతున్న రైలు బండిలో నుంచి చూస్తుంటే ఇళ్ళు, పొలాలు, చెట్లూ, వెనక్కు పరుగెత్తడం మహాచోద్యంగా వుంది. వక్క కొరికేటంత సేపట్లో మేము పాకాల జంక్షనులో వున్నాము. విళ్ళుపురం – రేణిగుంట బండి రావడానికి కొంత ఆలస్యమైంది. వచ్చిన బండి తమిళదేశపు గ్రామీణ ప్రాంతపు యాత్రికులతో బాగా రద్దీగానే వచ్చింది. అయినా ఒక పెట్టెలో ఎలాగో సర్దుకున్నాము.

బండి పనపాకం దాటి, చంద్రగిరి స్టేషను గూడా దాటుకుని ముందుకు పరుగిడుతోంది. పెట్టెలోని ప్రయాణీకులు ఉన్నట్టుండి ఒక్క పెట్టున "వడ్డికాసుల వాడా!

వేంకటా రమణా! గోవిందా! గోవిందా!" అంటూ భగవన్నామస్మరణ చేయసాగారు. అదేరా తిరుపతికొండ" అన్నారు నాన్నగారు.

"పాల సంద్రములోన పాప పానుపులా
రైలునందుండగనే కనిపించునీకు,
తులలేని అందాల తిరుపతి కొండ!
తెలుగమ్మ జడలోన మల్లెపూదండ!" – అంది దేవకి.

"అక్కా, అక్కా! ఏదీ, ఇంకొక్క నుడుగు" అంటూ బ్రతిమాలుకున్నాను. అప్పటికి తిరుపతి స్టేషను దగ్గరికొచ్చేసింది.

దేవకి కొనసాగించింది.

"ఏడు శిరసుల నాగు పడగెత్తినట్టు
బండి దిగుచుండగనె కనిపించు నీకు
గగనమ్ము నందుకొను గాలి గోపురము!
గోవింద రాజుల కచట కాపురము!"

"సాయంకాలం ఆ గుడికి వెళ్తున్నాము గదా!" అన్నారు నాన్నగారు.

ఆరోజు మధ్యాహ్నం స్టేషను దగ్గరగా ఉన్న దేవస్థానం వారి ధర్మసత్రంలో బస చేశాము. మధ్యాహ్నం భోజనం తరువాత ఒళ్లెరుగకుండా నిద్రపట్టింది. సత్రాని కల్లంత దూరంలోనే గోవిందరాజుల గుడి. వెంకటేశ్వరుడికి గోవింద రాజ స్వామి వరుసకు అన్న అవుతాడట! తమ్ముడి పెండ్లికి అప్పుచెయ్యడం కోసం ఆయన కుబేరుడి దగ్గరకి వెళ్ళాడు. కుబేరుడు కొండంత బంగారు కాసుల రాశిని చూపించి కొలుచుకోమన్నాడట. బళ్ళతో కొలిచి కొలిచి అలసిపోయిన స్వామి అట్లాగే బళ్ళను తలగడగా ఉంచుకుని శేషునిపైన వాలిపోయాడట. ఈ కథా వృత్తాంతాన్ని బలపరుస్తున్నట్టుగా గోవిందరాజస్వామి మాకు అనంత శయనుడై దర్శనమిచ్చాడు.

ఆ రాత్రికిక సత్రంలోనే నిద్ర. మరునాటి ఉదయం అయిదు గంటలకే మా యాత్రా బృందం కొండవైపు తరలింది. చీకట్లు విచ్చిపోతున్న కొద్దీ స్వామి కొండ స్పష్టంగా దృగ్గోచరం కాసాగింది.

దేవకి నా భుజంపైన చేయివేసింది. ఏమిటన్నట్లుగా తలపైకెత్తి ఆమె ముఖంలోకి చూచాను.

"అందు కోవలసిన ఆదర్శమట్లు
అహిరాజుగిరి పైన కనిపించు నీకు
లీలగా అలిపిరి గాలిగోపరము!
బాబులూ! శ్రమపడి ఎక్కాలి మనము!"

ఆ మాట నిజమే! అలిపిరిని అందుకునే సరికి అసురుసురై పోయాము. దేవకి హెచ్చరికలలోని వాస్తవం ఏ పాటిదో తెలిసొచ్చింది.

"అప్పుడే ఏమయింది? మోకాటి మెట్ల దగ్గర వుంది మీ కథ!" అన్నారు నాన్నగారు.

"ఆయాసంగా వుందిరా నాయనా! కాసేపు బడలిక తీర్చుకోక పోతే నేనెక్కలేను" అంటూ నానమ్మ ఒక మెట్టుపైన కూలబడిపోయింది.

అప్పటికి సూర్యోదయమై నాలుగు బారల ప్రొద్దెక్కింది. నులివెచ్చని పసిమి కిరణాల మలామాలో, పచ్చని తరులతా గుల్మాదులతో కూడిన కొండలు, కోనలు కన్నుల పండువగా ఉన్నాయి. మైమరిచి అక్కడెంత సేపు కూర్చున్నామో తెలియదు.

"ఆలస్యమైతే ఎండకు తట్టుకోలేము, పదండి, పదండి" అంటూ వేగిరించారు నాన్నగారు.

మా యాత్ర మళ్ళీ కొనసాగింది.

ఆరణ్య గర్భం గుండా ముందుగా నేను వెళ్తున్నాను. లోగొంతులో పాడుకుంటూ దేవకి నా వెనుక నుంచి నడుస్తోంది.

"జామ మామిడి వెలగ సీతాఫలము చెట్లు
చెట్లతో పెనవేసుకున్న పొదరిళ్ళు
కొల్లలమ్మా చెల్లి, ఈ కొండపైన
జల్లు జల్లని పారుచుండు సెలయేళ్ళు!"

అబ్బో, ఎన్నెన్ని సెలయేళ్ళో! విరామ మనేది తమ స్వభావానికి విరుద్ధమైనట్టుగా పడుతూ లేస్తూ త్రుళ్ళింతలిడుతూ, మలుపులు తిరుగుతూ, ఒకచోట బాహాటంగా కనిపించి, మరొకచోట అంతర్ధానమైపోతూ అల్లరి పిల్లల్లా ఇచ్ఛవచ్చినట్టల్లా ఆడుకుంటూ, తమదైన గొంతుతో పాడుకుంటూ అవి ఎక్కడికి వెళ్తున్నాయో!

మేమొక కొండ పేటు ప్రక్కన నడుస్తున్నాము. ఎడమవైపున నిటారుగా పైకి లేచిన పేటు. కుడివైపున పాతాళాన్నంటే పెద్దలోయ...

"కొండ కొమ్మును జూడ తలయెత్త బోకు
కొప్పులో పువ్వులు క్రింద జారేను!
ఆ లోయ పేరు అవ్వా సేరు కోన,
అటుచూడ బోకురా కళ్ళు తిరిగేను!"

చొక్కా కాలరు పట్టుకొని నన్ను వెనక్కు లాగుతూ అంది దేవకి.

ఉదయం తొమ్మిదింటికి మేము ఏడుకొండల మేడలెక్కి ఎక్కడికి చేరుకోవాలో అక్కడికి చేరుకున్నాము. పదివేల శేషుల పడగల మయమైన శ్రీహరి వాసాన్ని దూరదూరాల నుంచే కనుగొంటూ, దగ్గిరికి నడిచాము. శరీరానికి ఇంపితమైన, మనసుకు ఆహ్లాదకరమైన ఆ ప్రశాంత వాతావరణంలో పులకించిపోయాము. కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించడం, పుష్కరిణిలో స్నానం, పూట కూళ్ళఇంట్లో మధ్యాహ్న భోజనం, ఇన్ని పనులూ ముగిశాక, కదులుతున్న భక్తుల వరుసతో బాటు కదులుతూ జగములేలే ప్రభువు సన్నిధానంలోకి చేరుకునే సరికి గంట నాలుగున్నర కావచ్చింది.

నిలువెత్తు దేవుడు, నయన మనోహరంగా నిల్చున్నాడు. అభయముద్రపట్టి ఆశీస్సులందిస్తున్నాడు.

వరసలో నా ముందుగా నిల్చున్న దేవకి మెల్లగా పాడుకుంటూ వుంది.

"భక్తితో కొలిచిన కరుణించి మనకు
వరమిచ్చు వడ్డికాసుల వేల్పు వీడు-
ఈ రేడు లోకాల పాలించు వాడు
ఏడు కొండలపైన వెలసి యున్నాడు
శ్రీనివాస ప్రభో! నీకు జోహారు!
శ్రీ వేంకటేశ్వరా! నీకు జేజేలు!
అనుచు చేతులు మోడ్చి మ్రొక్కవలెనండి!
శుభములొదవును మనకు, ఇది తథ్యమండి!"

దేవకి చేతులు జోడించింది.

స్వామి పెదవిపైన మందహాసం మెరిసింది. "అమ్మాయ్! నీ భక్తిభావం గొప్పది. నీకు సమస్త సన్మంగళాలూ కలుగునుగాక!" అని దీవించాడు.

తరువాత వంతు నాదే! ఏమంటాడో! ఏమిటోననీ జంకుగొంకులతోనే అంజలి ఘటించాను.

"ఓరి చిలిపికుంకా! పుట్టి తొమ్మిదేళ్ళయ్యాక ఇప్పుడొస్తున్నావా! ఇక మీదట వీలయినప్పుడల్లా వస్తుంటావు గదా?" అన్నాడాయన.

"అట్లాగే స్వామీ. అట్లాగే" అన్నాను.

మరునాడు మేము గోగర్భం వెళ్ళాము. పాపనాశనంలో గ్రుంకులు తీశాము. జాబాలి తీర్థమంతా తిరిగి చూచాము. కొండల్లో కోనల్లో, పెరిగిన తరువుల్లో విరిసిన పువ్వుల్లో, జలాశయాల్లో, జలపాత్రాల్లో, సూర్యకాంతుల్లో, వెన్నెల వెలుగుల్లో, చలిగాలుల్లో, వానజల్లుల్లో వివిధ ప్రాంతాల, వివిధ భాషల, వివిధ వేషాల, వివిధ ఆకారాల ప్రజల వెల్లువల్లో భగవల్లీలలు భావించి, దర్శించి తరించాము. సత్రంలో ఓ గది తీసుకుని మా వంట మేమే చేసుకుంటూ మూడు రోజులపాటు భగవత్సన్నిధిలోనే ఉండి నాలుగో నాడు చంద్రగిరి దారిలో క్రిందికి దిగి వచ్చేశాము. పంచమి నాటితో ప్రారంభమైన మా యాత్ర దశమినాటితో ముగిసింది.

ఏకాదశి రాత్రి మా ఇంట్లో పెద్ద సమారాధనం జరిగింది. గాడిపొయ్యిలు తవ్వించి, గుండిగలు పెట్టించి, పెద్ద యెత్తున వంటలు చేయించి, సమీప ప్రాంతాలలోని బంధుమిత్రుల నందరినీ పిలిపించి, యాత్రకు వెళ్ళి తీసుకొచ్చిన తీర్థ ప్రసాదాలన్నీ పంచిపెట్టిన తర్వాత, మృష్టాన్నాలతో వారిని సంతృప్తుల్ని కావించాము. సాకల్యంగా నెరవేరిన ఇలు తీర్థాన్ని పురస్కరించుకొని, పలానా వాళ్ళు గొప్ప సమారాధన చేశారని చుట్టుపక్కల గ్రామాల వాళ్ళు ఘనంగా చెప్పుకున్నారు.

❀ ❀ ❀ ❀

చెప్పాను గదండీ, ఇదంతా యాభైయేళ్ళ క్రిందటి సంగతి. నా ప్రస్తుత నివాసం హైదరాబాదు. రాష్ట్రస్థాయి ఉద్యోగిని. జీతం పదివేలు, క్వార్టర్స్ ఫ్రీ, రెండు కార్లు, మూడు ఫోన్లతోబాటు నలుగురు పనివాళ్ళు ఎల్లప్పుడూ నా ఆధీనంలో వుంటారు. ఉన్న వ్యాపకాలను

బట్టి నాకు వీలు దొరకడం కలలోని మాట! అయినా వీలు చేసుకుని ఏడాదికోసారి తిరుపతి వెళ్తాను.

ఏదైనా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళి దిగేసరికి స్థానికులైన క్రింది ఉద్యోగులు నా కోసం కారు ఏర్పాటు చేసి వుంటారు. కొండపైకి ఓ గంట ప్రయాణం. మధ్యాహ్నానికల్లా ప్రత్యేక దైవ దర్శనం. సాయంకాలం మళ్ళీ ఏదో ఒక బండిలో తిరుగు టపా తప్పనిసరి.

ఈ తాపత్రయాన్ని చూచి స్వామి జాలిపడడం రివాజైపోయింది. "ఏం నాయనా! బాగా బిజీ అయిపోయావు గదూ! భార్యా బిడ్డలతోనైనా గడపడానికి తీరికలేనట్టుంది. అయ్యో పాపం!" అంటుంటాడాయన.

"అవును స్వామీ! నేను తింటున్నానే గాని ఆ తిండిలోని రుచిని ఆస్వాదించలేక పోతున్నాను. జీవిస్తున్నానే గానీ జీవితంలోని మాధుర్యాన్ని చవి చూడలేకపోతున్నాను. యాత్ర చేస్తున్నానే గానీ యాత్రానందాన్ని పొందలేక పోతున్నాను. యాంత్రిక నాగరికత నన్నొక యంత్రంగా మార్చేసింది. నువ్వేమో రాతినే నాతిగా మార్చిన వాడివి! నన్ను మళ్ళీ మనిషిగా చేయవా స్వామీ?" అని నేను వేడుకుంటూ వుంటాను.

♦ *ఆంధ్రప్రభ వారపత్రిక*, 1991 ♦